## జీపీ భవన నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

ఎల్లారెడ్డి, డిసెంబర్ 9: నాగిరెడ్డిపేట మండలంలోని మెల్లెకుంట తండాలో కొత్తగా నిర్మాణం చేస్తున్న గ్రామ పంచాయతీ భవనం పనులను శనివారం స్థానిక నాయకులతో కలిసి జడ్పీటీసీ మనోహర్ రెడ్డి పరిశీలించారు. రెండు రోజుల క్రితం పంచాయతీ భవనం కోసం స్లాబ్ వేయడంతో పనులను ఆయన పరిశీలించి మేస్త్రీలతో మాట్లాడారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. రూ.20లక్షలతో చేపడుతున్న పనులను సంబంధిత పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు పర్యవేక్షిస్తారని అన్నారు. ఆయనవెంట స్థానిక నాయకులు వశ్రం నాయక్, దేవీసింగ్, హరిలాల్, పలువురు వార్డు సభ్యులు ఉన్నారు.

# పంటలకు తెగుళ్ల బెడద

- మినుము, పొద్దు తిరుగుడు, పొగాకుపై వింత పురుగు దాడి
- ఆందోళన చెందుతున్న రైతులు

డోంగ్లీ, డిసెంబర్ 9: మండలంలో రైతులు సాగుచేస్తున్న మినుము, పొద్దు తిరుగుడు, పొగాకు పంటలకు తెగుళ్లు సోకుతున్నాయి. ఈ పంటలపై వింతపురుగు దాడి చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని డోంగ్లీ, లింబూర్, హసన్ టాక్లీ, పెద్ద కాక్లీ, సిర్‌పూర్, మొఘ గ్రామాల్లో సాగు చేస్తున్న పంటలపై ఈ పురుగు ఉధృతి అధికంగా ఉన్నదని రైతులు తెలిపారు. పంట ఆకులను పురుగు తినడంతో అది నల్లగా మారుతున్నది. కొన్ని వందల ఎకరాల్లో పంటలు మొత్తం నల్లగా మారాయి. రాత్రి వేళలో పురుగు బయటికి వచ్చి పంటపై దాడి చేస్తున్నదని, ఉదయం భూమిలోకి వెళ్లుందని రైతులు అంటున్నారు. రాత్రి వేళలో దాడిచేయడంతో తాము త్వరగా గుర్తించలేక పోయామని తెలిపారు. ప్రస్తుతం మండలంలో వెయ్యి ఎకరాల్లో మినుము, 800 ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంటను సాగుచేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితులు లేవని రైతులు వాపోతున్నారు. పురుగు ఉధృతి రాత్రి వేళలో మాత్రమే ఉండడంతో రైతులు రాత్రి సమయంలోనే మందులను పిచికారీ చేస్తున్నారు. ఇప్పటికే సాగు కోసం ఎకరాకు రూ.15వేల వరకు ఖర్చు అయ్యిందని, ప్రస్తుతం క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాలంటే మరింత ఆర్థిక భారం అవుతుందని రైతులు వాపోతున్నారు.

***పట్టించుకోని వ్యవసాయాధికారులు..***

మినుము, పొద్దుతిరుగుడు, పొగాకు పంటలపై వింత పురుగు దాడిచేస్తున్నా వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. పంటలకు తెగులు సోకిందని వారికి తెలిపినా.. వ్యవసాయ క్షేత్రాలను సందర్శించడం లేదని అంటున్నారు. కార్యాలయానికి వెళ్లి ఇప్పటికే సమాచారం అందించామని, ఇప్పుడు వస్తాం.. అప్పుడు వస్తాం.. అంటూ కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే ఎక్కువ శాతం పంటను నష్టపోయామని, అధికారులు త్వరగా పొలాలను సందర్శించి తగిన సూచనలు, సలహాలు అందజేయాలని రైతులు కోరుతున్నారు.



డోంగ్లీ శివారులో పంట ఆకును తింటున్న పురుగు

# గురుకులాల రాష్ట్రస్థాయి క్రీడలు ప్రారంభం



హైజంప్ చేస్తున్న విద్యార్థి



క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్సై సుధాకర్

రామారెడ్డి, డిసెంబర్ 9: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల క్రీడలు మండలంలోని ఉప్పల్‌వాయి గురుకుల పాఠశాల ఆవరణలో శనివారం ప్రారంభమయ్యాయి. ఎస్సై సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందని అన్నారు. క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమికి కృంగిపోకుండా గెలుపుకోసం ప్రయత్నించాలని అన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాలల నిజామాబాద్ రీజినల్ కో-ఆర్డినేటర్ అలివేలు, సాంఘిక సంక్షేమ గురుకులాల రాష్ట్ర క్రీడాధికారి రామ్‌లక్ష్మణ్, జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి షేక్ సలాం, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, రామారెడ్డి మండల వైద్యాధికారి సురేశ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజరత్నం, పీఈటీ మహేశ్, సర్పంచ్ గంగారాం, ఉపసర్పంచ్ సరస్వతి, గురజాల నారాయణరెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## 12న తాడ్వాయి మండల సర్వసభ్య సమావేశం

తాడ్వాయి, డిసెంబర్ 9 : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజ్‌వీర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ కొడి రవి అధ్యక్షతన సమావేశం ప్రారంభం అవుతుందని తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, జడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



బిచ్కుందలో పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజాంసాగర్/ పిట్లం/ పెద్దకొడప్‌గల్/ బిచ్కుంద/ మద్నూర్/ తాడ్వాయి, డిసెంబర్ 9: కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. దవాఖానల్లో రోగులకు పండ్లు పంచి పెట్టారు. ఆమె ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, మద్నూర్, తాడ్వాయి మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్త్రీలు, బాలికలపై హింసను అరికట్టాలి

**ఐఎస్‌ఆర్డీ ప్రతినిధి అమృత రాజేందర్**



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఐఎస్‌ఆర్డీ ప్రతినిధి అమృత రాజేందర్

సదాశివనగర్, డిసెంబర్ 9: లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా సదాశివనగర్‌లోని ఐకేపీ కార్యాలయంలో మహిళలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అమృత రాజేందర్ ఐకేపీ సిబ్బంది, మహిళలకు లింగ ఆధారిత హింసపై వివరించారు. బాలికలు, మహిళలపై అనేక రకాలుగా జరుగుతున్న దాడులపై ఆయన మాట్లాడారు. కళాశాలల్లో విద్యార్థులు వేధింపులకు గురైతే షీ టీమ్, డయల్ 100కు కాల్ చేయాలని లేదా హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు, వీవోఏ పర్యావేక్షణ సమాఖ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ

బోధన్ రూరల్, డిసెంబర్ 8: బోధన్ మండలంలోని ఊట్‌పల్లి గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి శనివారం పలువురు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆరు నెలల క్రితం అర్సపల్లి శివారులో మృతిచెందిన కుటుంబానికి ఊట్‌పల్లి గ్రామానికి చెందిన గిరిజన ఉద్యోగులు 10 క్వింటాళ్ల బియ్యంతోపాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దల సమక్షంలో బాధిత కుటుంబాలకు నిత్యావసరుకులను అందజేశారు. కార్యక్రమంలో గిరిజన ఉద్యోగులు స్వామి నాయక్, డీవీ కిషన్, వసంత్, పుష్పలత, ఆర్. సంతోష్, డీవీ రాంజీ, గ్రామ పెద్దలు డీవీ సంతోష్, మధుకర్, జట్‌పట్ బాబు, గోవింద్, పరశురాం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సరుకులను పంపిణీ చేస్తున్న గిరిజన ఉద్యోగులు

# టీటీడీ ఆధ్వర్యంలో గీతా శ్లోకాల పోటీలు



శ్లోకాల పోటీల్లో పాల్గొన్న నిర్వాహకులు, విద్యార్థులు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 9 : ఆధునిక జీవిత సంఘర్షణలో నలిగిపోతూ విషాదయోగాన్ని అనుభవిస్తున్న నేటి యువతకు భగవద్గీత చక్కటి కరదీపిక అని, మానవ జీవన సరళిని నియంత్రిస్తూ జీవన గమనానికి సత్యమైన గమ్యాన్ని చూపే గీతామృతం భగవద్గీత అని అఖిల భారతీయ భగవద్గీత కేంద్ర ప్రచార మండలి గౌరవ అధ్యక్షుడు నరేందర్ రావు షిండే అన్నారు. నగరంలోని శివాజీనగర్‌లో ఉన్న గీతా మందిరంలో టీటీడీ, జిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ శ్లోక పోటీలను శనివారం నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని అభ్యాస, శ్రీరామకృష్ణ, నిర్మల హృదయ, ప్రెసిడెన్సీ తదితర పాఠశాలలకు చెందిన 200కు పైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా వీపీ చందన్‌రావు, యోగా రాంచంద్రం, కవిత, జానకి, సముద్రాల మాధురి, చంద్రశేఖర్‌శాస్త్రి వ్యవహరించారు. 6, 7, 8 తరగతుల విభాగంలో నవతేజ, వెంకట షణ్ముఖ కులకర్ణి, సాయిసంవేద.. 8, 9, 10 తరగతుల విభాగంలో అనుష్, స్వర్ణ, లాస్య, 19 సంవత్సరాల పైబడిన విభాగంలో మంజీర విజేతలుగా నిలిచారు. శ్లోకాల పోటీల్లో విజేతలకు జిల్లా ఆర్గనైజర్ వేదాంతం సీతారామచంద్రమూర్తి బహుమతులుగా పుస్తకాలను అందజేసి అభినందించారు.

### 20 శ్లోకాలతో..

ముబారక్‌నగర్‌కు చెందిన లలిత– రమేశ్ దంపతుల కుమార్తె బి. స్వతంత్ర పోటీల్లో 3వ అధ్యాయం కర్మయోగంలోని 20 శ్లోకాలు పఠించి ప్రశంసలు పొందింది. ప్రస్తుతం శివాజీనగర్‌లోని రామకృష్ణ విద్యాలయంలో 6వ తరగతి చదువుతున్నది.

### 700 శ్లోకాలతో..

18 ఏండ్లు పైబడిన వారి విభాగంలో 18 అధ్యాయాల్లోని 700 శ్లోకాలను స్వరయుక్తంగా పఠించి విజేతగా నిలిచారు గంగస్థాన్‌కు చెందిన మంజీర. గంగస్థాన్‌లోని గణపతి ఆశ్రమాలయంలో పిల్లలు, యువతకు ఉచితంగా భగవద్గీత శ్లోక పఠన తరగతులను నిర్వహిస్తున్నారు.